# సాంఘిక జీవనం

[గల్పిక]

"శాస్త్రి చాలా తెలివి గలవాడే కాని, ఎవడితోనూ కలిసిరాడు; అదీ వొచ్చిన చావు!" అన్నాడు శర్మ.

"లేకపోతే, వాడీపాటికి ఏదోఒక నౌకరీ కుదిరి సంసార పక్షంగా కాలయాపన చేసును," అన్నాడు రావు.

"వెధవది-సంగీతమూ, సినీమాలూ-వీటిదగ్గిర కూడా వాడి దారి వాడిదీ, ఇతర్ల దారి ఇతర్లదీనూ!" అన్నాడు దాసు.

"పోనిస్తూ, వట్టి పెడకట్టె; అన్సోషల్ ఫెలో!"— అన్నాడు మూర్తి.

నలుగురూ శాస్త్రి స్నేహితులే. సాంఘికజీవితం నేర్చుకోమని వాళ్ళు శాస్త్రికి నూరి పోసేవాళ్లు. శాస్త్రికి మరి రోజుకు కనీసం రెండు సార్లయినా పావలాడబ్బులు అవసరమవుతూ ఉండేవి. ఆ మాట చెప్పకునేటందుకు అతనికి ఈ నలుగురూ తప్పలేరు. అప్పటికీ తన దారిద్ర్యం వాళ్ళదగ్గిర దాచటానికి ప్రయత్నంచేస్తూ ఉండేవాడు. వాళ్ళు కూడా మంచిస్నేహితులు గనక, తమకుతామై అతనిఆర్థికస్థితి విచారించిగాని, అతనికి డబ్బివ్వటానికి ప్రయత్నించిగాని, అతని దారిద్ర్యం గుర్తించిగాని, అతన్ని అవమానించేవారు కారు.

అయినా, అతను తన స్నేహితుల దగ్గిర తన దారిద్ర్యం బయటపెట్టక తప్పేదికాదు. అణాలూ బేడలూ అర్థించకా తప్పేది కాదు. అటువంటప్పుడు వాళ్ళంతా పాత పాట మొదలుపెట్టేవారు.

"నీకు డబ్బు అక్కర కలగటం ఆశ్చర్య మేముందీ ?"

"ఏదో ఉద్యోగా లేడుస్తున్నవాళ్ళం, మా చేతుల్లోనే డబ్బు మెసలనప్పుడూ !"

"ఏదోవిధంగా ఎవరో ఒకరి కాళ్ళు పట్టుకుని ఒక చిన్న ఉద్యోగం సంపాదిస్తే, ఇంత చిక్కు లేకుండా ఉండునా ?"

" 'అయ్యో, పాపం ! డబ్బులేక అల్లాడు తున్నాడే !' అని నిన్ను గురించి దిగులుపడేవాడు లేడాయె, ఇంత ప్రపంచంలోనూ !"

ఇంతలో శాస్త్రి రాసినకథ అచ్చయింది. పత్రిక వారు అయిదురూపాయిలు పంపారు.

రావు వచ్చి శాస్త్రితో, "బ్రదర్, ఒక్క రూపాయి బదులివ్వరా. ఎల్లుండి జీతంరాగానే ఇస్తాను!" అన్నాడు. శాస్త్రి ఇచ్చాడు, పోనీ, ఎల్లుండిదాకా అయినా ఒక రూపాయి మిగిలిన ట్టవుతుందని.

శర్మ వచ్చి, "శాస్త్రీ, మొన్న నేను చెప్పిన పెంగ్విన్ పుస్తకం కొందామా ? ఏ డణాలు వెధవది !" అన్నాడు. పెంగ్విన్ పుస్తకం కొనబడింది. దాన్ని శర్మ తీసుకుని, పూర్తికాగానే మరెవ్వరికీ ఇవ్వకుండా, శాస్త్రికే ఇచ్చేస్తానని వాగ్దానం చేశాడు.

దాసూ మూర్తీ వచ్చి, "ఏందోయ్ ! వచ్చిందిట? ఏదీ టీపార్టీ?" అన్నారు. ముగ్గురూ కలిసి కాఫీ హోటలుకు వెళ్ళి, ఏ డణాల ముక్కానీకి తినేశారు.

అయిదురూపాయలనోటుమింజుమలె మూడురూపాయలు మాత్రమే బిక్కుబిక్కుమంటూ తన చేతిలో ఉన్నై. అది

చూసి, శాస్త్రికి కళ్ల నీళ్ల పర్యంతమయింది.

ఒక్కదమ్మిడీ బాకీ అయినా తీరకమునుపే రెండు రూపాయలు అయిపోయినై. ఇందులో ఇంకా బాకీలుకూడా తీరిస్తే, తనకు మిగిలేదేమిటి! తన నలుగురు స్నేహితుల బాకీలే ఉన్నై. రావుకు—ఆరున్నా నాలుగు పదిన్నీ మూడు పదమూడున్ను మూడు—రూపాయీ! బతుకు జీవుడా! ఆ రూపాయి రావుకు సరిపోయింది. శర్మకు—మూడున్నరా ఒకటిన్నరా అయిదూ రెండూ ఏడూ! ఆ పెంగ్విన్ పుస్తకం, ఖరీదు! చిత్రంగా ఉందే! దాసుకు—మూడణాలూ మూర్తికి—రెండణాల ముక్కానీ—సరిగా వాళ్లు కాఫీ హోటల్లో తిన్నంతా!

"ఇదే కామాలు సాంఘిక జీవనం!" అనుకున్నాడు శాస్త్రి.

---